క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి గౌరవ అతిథిగా స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

మాజీ సర్పంచ్ చిన్న దస్తగిరిరెడ్డి మృతి


చిన్న దస్తగిరిరెడ్డి (ఫైల్)

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడులో మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్నాటి చిన్న దస్తగిరిరెడ్డి (78) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. పూసలపాడు పంచాయతీకి రెండుసార్లు సర్పంచ్‌గా గెలుపొందారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మాజీ ఎంపీపీ పి.వెంకటరాజు, మాజీ సైనికుల సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, సర్పంచ్ మొగుళ్లూరి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ తమ్మినేని కోటమ్మ దస్తగిరిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం

గిద్దలూరు రూరల్: గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా పట్టణంలోని గాయత్రిమాత ఆలయంలో శుక్రవారం మహా గాయత్రి యజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు, గాయత్రి యజ్ఞం నిర్వాహకులు సూరం నారాయణరెడ్డి మాట్లాడుతూ మానవుడు ఆధ్యాత్మిక జీవనం గడిపితే సవ్యమైన ఆలోచనలు కలుగుతాయన్నారు. ఇటువంటి భక్తి కార్యక్రమంలో పాల్గొని గాయత్రి యజ్ఞం విశిష్టతల గురించి తెలుసుకుంటే జీవితం సుఖవంతం అవుతుందన్నారు. యావత్తు మానవాళి రక్షణ కోసం గాయత్రి యజ్ఞం దోహదపడుతుందన్నారు. యజ్ఞంతో సకల దేవతలు సంతోషిస్తూ ప్రకృతి సమతుల్యానికి కృషి చేస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు బచ్చు వెంకటేశ్వర్లు, లలిత ప్రసన్న, వి.వీరారెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీలో మెడికల్ క్యాంపు


మాట్లాడుతున్న డాక్టర్ శరత్ చంద్ర


పొదిలి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం మెడికల్ క్యాంపు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యాధికారి శరత్ చంద్ర ఆధ్వర్యంలో బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. డెంగీ, మలేరియా, సికిల్ సెల్ అనీమియా వ్యాధులపై అవగాహన కల్పించారు. ముందస్తు జాగ్రత్తలు, రోగ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యసేవల గురించి వివరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అనూరాధ, ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం


శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి మూలవిరాట్

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు విజయ్‌కాంత్‌శర్మ, నిర్వాహకులు పాతకోట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం అర్చనలు, అభిషేకాలతో పాటు 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 12 గంటలకు అన్నసంతర్పణ, సాయంత్రం స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు.

ఉపాధి హామీ ఏపీఓ జిల్లా అధ్యక్షుడిగా జీవరత్నం ఎన్నిక


జీవరత్నం

మార్కాపురం రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ల జిల్లా యూనియన్ అధ్యక్షుడిగా మార్కాపురం ఏపీఓ బి.జీవరత్నం ఎన్నికయ్యారు. ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.కొండయ్య, కార్యదర్శిగా కె.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ధనుంజయవర్మ, కోశాధికారిగా జి.రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా, సలహాదారులుగా మరికొందరు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జీవరత్నాన్ని పలువురు అభినందించారు.

ముందుకు సాగని ఖరీఫ్ సాగు

- వర్షపాతం తీరులో తేడాలు.. పదును కాని పొలాలు
- పొదిలి మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 10,406 హెక్టార్లు
- సాగైంది సుమారు 10 హెక్టార్లేనంటున్న వ్యవసాయాధికారులు


ట్రాక్టర్‌తో అంతర సేద్యం చేస్తున్న రైతు

పొదిలి: వ్యవసాయ పనులు ఊపందుకోవాల్సిన సమయంలో రైతులు, రైతు కూలీలు వరుణుడి కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పొదిలి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 10,406 హెక్టార్లు కాగా జూలై నెల ప్రారంభమైనా పంటలు వేసేందుకు అనుకూలమైన పరిస్థితులు లేకపోవడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. ఓ మోస్తరు వర్షాలు కురిస్తే మరో ఇరవై రోజుల వ్యవధిలో పంటల సాగు ఊపందుకునే అవకాశముందని రైతులు భావిస్తున్నారు. మండలంలో ప్రధానంగా 8797 హెక్టార్లలో కంది, 670 హెక్టార్లలో సజ్జ, 293 హెక్టార్లలో మిర్చి, 104 హెక్టార్లలో పత్తి సాగు చేస్తారు. సజ్జ, కంది మిశ్రమ పంటగా ఎక్కువగా సాగు చేస్తారు. అయితే ప్రస్తుత సీజన్‌లో ఇంత వరకు కేవలం 8 హెక్టార్లు మాత్రమే సజ్జ సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెప్పారు. సజ్జకు అదును దాటుతుండగా, కంది సాగు చేసేందుకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉంది. రైతులంతా పంటలు సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుని ఉన్నారు.


రైతులు సాగుకు సిద్ధం చేసిన పొలాలు

వర్షపాతంలో తేడాలు..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్, జూలై వర్షపాతం ప్రధానం. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 47.3 మి.మీ కాగా, 118.7 మి.మీ నమోదైంది. అంటే రెండు రెట్ల కంటే ఎక్కువగానే వర్షం కురిసింది. అయితే పొలాలు అన్ని ప్రాంతాల్లో పదును కాలేదు. జూలై నెలలో 78.7 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ప్రారంభంలోనే 29.7 మి.మీ వర్షపాతం నమోదైంది. నమోదైన వర్షపాతానికి, ఆయా ప్రాంతాల్లో కురిసిన వర్షానికి సంబంధం లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పట్టణంలోనే ఎక్కువగా వర్షపాతం నమోదైందని, ఇంకా కొన్ని గ్రామాల్లో పొలాలు పదునెక్కేలా వర్షం కురవలేదని చెబుతున్నారు. చాలా వరకు రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారని, వర్షం కురిసి పదునైతే వెంటనే సాగు చేస్తారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నేడు రేబిస్ వ్యాక్సినేషన్


పెంపుడు కుక్కను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి

కొనకనమిట్ల: జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల పశు వైద్యశాలల్లో కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం చేపట్టినట్లు ఆయా గ్రామాల పశు వైద్యులు అమూల్య, రాజ్యలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు రేబిస్ వ్యాధి నివారణ గురించి వివరించారు. 1885 జూలై 6న లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి మొదటిసారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారని. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో అప్పటి నుంచి అదే రోజును ప్రపంచ జూనోషస్ దినత్సవంగా పాటిస్తున్నారన్నారు. పశు పోషకులు, పశు వైద్య వృత్తిలో ఉన్నవారు, పశువుల డెయిరీలో పని చేసేవారు, పాల ఉత్పత్తులు ఆహారంగా తీసుకునేవారు, సరదదా కోసం కుక్కలు, పక్షులు పెంచుకునేవారికి వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. పశు పక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమించే ముఖ్యమైన జునోటిక్ వ్యాధుల్లో రేబిస్ వ్యాధి(పిచ్చికుక్క కాటు వ్యాధి), బ్రూసెల్లోసిస్ వ్యాధి, బర్డ్ ఫ్లూ, దొమ్మ రోగం(ఆంత్రాక్స్), టీబీ లేదా క్షయ, లెప్టో స్పైరోసిస్ వ్యాధులు ఉన్నాయన్నారు. వ్యాక్సినేషన్‌ను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

కళాశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈఓ


విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్, ఇంటర్మీడియెట్ కళాశాలను మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం తరగతులకు 15 మంది విద్యార్థులు హాజరయ్యారు. బోటనీ, జువాలజీ సబ్జెక్ట్ అధ్యాపకులను నియమించాలని ప్రిన్సిపాల్ ఎంఎస్ శర్మ కోరారు. అధ్యాపకులను సర్దుబాటు చేయాలని ఎంఈఓలకు సూచనలు ఇచ్చారు. హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ ఎంఎస్ శర్మ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్లకు ప్రత్యామ్నాయం చూపాలి



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు డీఎస్‌టీ స్కూల్లో ఎన్‌రోల్‌మెంట్ లేకపోవడంతో స్కూల్ మూతపడి మధ్యాహ్న భోజనం, శానిటేషన్ వర్కర్లు ఉపాధి కోల్పోయారని, వారికి వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య కోరారు. పట్టణంలోని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇతర స్కూల్స్‌లకు బదిలీ చేశారని, మధ్యాహ్న భోజనం శానిటేషన్ వర్కర్లను ముండ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి విధుల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీన దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నారని, ఈ సందర్భంగా ప్రతి కార్మికుడు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సీఐటీయూ నాయకులు నరసింహులు, కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే సమీరా, పుష్ప, జహీరా, వై.రాధ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కోటయ్య

పొదిలి: దర్శి రోడ్డులోని ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల వద్ద ఎస్సై కోటయ్య శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాల నుంచి హెల్మెట్ కాపాడుతుందని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. రోడ్డు నిబంధనలను పాటించని వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సాయితత్వం.. అద్వితీయం


సాయిరామ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మార్కాపురం: సాయితత్వం అద్వితీయమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఏవీఎస్ సాయిరామ్ పేర్కొన్నారు. గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా నెహ్రూ బజారులోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 4 నుంచి వారం రోజులు ప్రముఖులతో ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా గురువారం రోజు ఆదిపూడి వెంకట శివసాయిరామ్ ×సాయినాథుడు సర్వాంతర్యామి≀ అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం నిర్వహించారు. బాబా మార్గం, ఆత్మజ్ఞాన మార్గమని భగవంతుడు సర్వజీవులలో ఉన్నాడని సర్వాంతర్యామి సకల ప్రాణులలో భగవంతుడిని చూడటమే నిజమైన జ్ఞానమని, అందరినీ ప్రేమించడమే సాయితత్వమని పేర్కొన్నారు. సాయితత్వంపై శనివారం ఎల్వీ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్‌బీ ఉపన్యాసం ఉంటుందని మందిరం అధ్యక్ష కోశాధికారులు గోపాలుని హరిహరరావు, పీఎల్ఎన్‌వీ నాగరాజు తెలిపారు. అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, రామడుగు నాగాగోపి, గోపిశెట్టి కొండయ్య, కృష్ణమోహన్, కరీం, వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, మధు, సాయిబాబా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం శివ సాయిరామ్‌ను ఘనంగా సన్మానించారు.

జగదాంబ అమ్మవారికి పూజలు


ప్రత్యేక అలంకారంలో జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ఉషామురళి

దొనకొండ: అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉషామురళి మాట్లాడుతూ అధికారులు ప్రజల వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డి కొన్ని ప్రశ్నలు వేయటంతో అధికారులు సమాధానం తెలిపారు. పలు శాఖలకు చెందిన అధికారులు సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురికిపూడి సుధాకర్, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఎంఈఓ ఎస్.సాంబశివరావు, ఈఓఆర్డీ ప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల రాస్తారోకో


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎస్సై, ఎంపీడీఓ

కొమరోలు: తమ జీతభత్యాలు చెల్లించాలంటూ పారిశుధ్య, స్వచ్ఛ భారత్ కార్మికులు శుక్రవారం రాస్తారోకో చేశారు. మండల కేంద్రం కొమరోలులోని అమరావతి–కడప జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. 30 నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలను సర్పంచ్ నిలిపి వేశారు. జీతాలు చెల్లించాలంటూ కోరుతున్నా ఎలాంటి స్పందన లేకపోవడంతో గ్రామ సచివాలయం ఎదురుగా రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దాదాపు అర గంటపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై మధుసూదన్‌రావు, ఎంపీడీఓ నరసింహారావు రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రదేశానికి చేరుకుని కార్మికులతో చర్చించారు. జీత భత్యాలు గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి ఇప్పిస్తామని నచ్చజెప్పడంతో పారిశుధ్య కార్మికులు గ్రామ సచివాలయం ఎదురుగా కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. నిరసన శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

కురిచేడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో సీజనల్ వ్యాధులు, డయేరియాపై మండల కో ఆర్డినేషన్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించిన మాట్లాడారు. ప్రతి గ్రామంలో మురుగు కాల్వ పూడికలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. మలేరియాపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఈ సీజన్లో దోమ కాటు ద్వారా వచ్చే డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా ప్రతి గ్రామంలో క్లోరినేషన్, మురుగు కాల్వల్లో నీరు నిల్వలు ఉన్నచోట దోమల మందు పిచికారీ చేయాలని వైద్యాధికారి పి.ప్రవీణ్ తెలిపారు. ప్రతి శుక్రవారం నీరు నిల్వ ఉన్న పాత్రలను శుభ్రం చేసి మళ్లీ నీరు నిల్వ చేసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.బసవరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బసవరాణి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మానవతా సంస్థ అధ్యక్షుడిగా 'సామంతపూడి'


అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న సభ్యులు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులుగా సామంతపూడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా బండి అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమపై నమ్మకంతో పదవులను అప్పగించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరింత సమయం సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా సేవ చేసేందుకు ముందు ఉంటామని నాగేశ్వరరావు, అశోక్ చెప్పారు. వీరిని శాలువా, పూలదండలతో సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ముప్వల పార్థసారథి, కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.యల్లమందారెడ్డి, డైరెక్టర్లు జీసీ సుబ్బారావు, యక్కలి శేషగిరిరావు, కరీముల్లా బేగ్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గూడూరి వినోద్, సోమిశెట్టి చిరంజీవి, బాజీ కరీముల్లా, రావూరి శ్రీకాంత్, బొగ్గవరపు శ్రీనివాస్, కుమార్, మహిళా ప్రతినిధులు సోమిశెట్టి శ్రీదేవి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.